జనవాక.. వసతులు లేక!

పారిశ్రామికంగా ప్రగతి సాధించిన గాజువాక అన్ని వర్గాల ప్రజలను అక్కున చేర్చుకుంది. దినసరి కూలీల నుంచి పెద్ద ఉద్యోగస్తులు.. బడా వ్యాపారులకు చోటిచ్చింది. ఫలితంగా జన సాంద్రత పెరిగింది. ఇప్పుడు అదే సమస్యగా మారింది. పెరిగిన జనాభాకు అనుగుణంగా రోడ్లు, పార్కింగ్ ప్రదేశాలు, క్రీడా మైదానాలు లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- గాజువాకను వెంటాడుతున్న స్థల సమస్య
- రోడ్లపైనే పార్కింగ్
- క్రీడా వికాసానికి మైదానాల లేమి

గాజువాక: గాజువాకను స్థల సమస్య వెంటాడుతోంది. ఆటలకు రోడ్లే క్రీడా మైదానాలు.. వ్యాపారాల నిర్వహణకు, వాహనాల పార్కింగ్‌కూ రహదార్లే ఆధారం. మహానగరంలో అతిపెద్ద జోన్ అయిన గాజువాక దుస్థితి ఇలా మారింది. 20 వార్డులతో విస్తరించి ఉన్న గాజువాకలో స్థల సమస్యతో అన్నీ కార్యకలాపాలు రోడ్లమీదే కొనసాగుతున్నాయి. ఫలితంగా ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఆట స్థలాలేవి?

దినదినాభివృద్ధి చెందిన గాజువాకలో సరైన క్రీడా ప్రాంగణం లేదు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులున్నా ఈ ప్రాంతానికి సరైన మైదానం లేకపోవడంతో క్రీడాకారులు నడిరోడ్లపైనే సాధన చేస్తున్నారు. గాజువాక మున్సిపాలిటీగా ఉన్నప్పుడు 1991లో వినాయకనగర్ వుడా కాలనీలో మూడున్నరెకరాల స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి తొలిసారిగా భూమి పూజ చేశారు. అనంతరం నిధులు లేవని వుడా చేతులెత్తేయడంతో ఆ పనులు శిలాఫలకంతోనే ఆగిపోయాయి. మళ్లీ దశాబ్దంన్నర తర్వాత ఇందిరా ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్ (క్రీడా సముదాయం) పేరిట 2005 నవంబర్‌లో అదే మైదానంలో శంకుస్థాపన చేశారు. దీనికి అవసరమైన రూ.4.50 కోట్ల నిధులను సామాజిక బాధ్యత నిధుల నుంచి హెచ్‌పీసీఎల్ మంజూరు చేసింది. దీనిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆ నిధులు కూడా పక్కకు పోయాయి. దీంతో మళ్లీ మైదానం కథ మొదటికే వచ్చింది. వికాస్ నగర్‌లో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసినప్పటికీ అనుకున్నంత స్థాయిలో అది క్రీడాకారులకు అందుబాటులోకి రాలేదు. దీంతో పిల్లలు ఆడాలంటే రోడ్డే ఆట స్థలంగా మార్చుకోవాల్సి వస్తోంది.



సౌకర్యాలు లేని మైదానంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు

గాజువాక మెయిన్‌రోడ్డులో ఫుట్‌పాత్‌లు వ్యాపార కేంద్రాలుగా మారాయి. రెడీమేడ్ వ్యాపారులు, చెప్పుల దుకాణాలు, పండ్ల వ్యాపారాలు సాగుతున్నాయి. గతంలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించుకొనే వారిని హాకర్ జోన్‌కు తరలించాలని ప్రతిపాదించారు. రాజకీయ అడ్డంకులు రావడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. పెద్దపెద్ద షోరూమ్‌లు కూడా ఫుట్‌పాత్‌లను తమ వ్యాపారాల కోసం ఉపయోగించుకొంటున్నాయి. సరైన పార్కింగ్ ఏర్పాటు చేయకపోవడంతో కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. ఫలితంగా గాజువాక ట్రాఫిక్ పద్మవ్యూహంగా మారుతోంది.



గాజువాక మెయిన్ రోడ్‌లో చిరు వ్యాపారాలు

రోడ్లపైనే భారీ వాహనాలు

ఇరుకురోడ్లతో నిత్యం రద్దీగా ఉన్న గాజువాకలో వాహనాల పార్కింగ్ సమస్యగా మారింది. భారీ వాహనాలను సైతం జనావాసాల మధ్య, ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. ట్రక్ టెర్మినల్ లేకపోవడంతో ట్యాంకర్లు, లారీలు, ట్రాలర్ల పార్కింగ్ సమస్యాత్మకంగా మారింది. పోలీసుల తాత్కాలిక అనుమతితో శ్రీనగర్‌వద్ద, షీలానగర్ జాతీయరహదారిపై వాహనాలను నిలుపుతున్నారు. అనధికారికంగా చినగంట్యాడలోని కణితి రోడ్, వందడుగుల రోడ్‌లోనూ నిలిపివేస్తున్నారు. దీంతో ప్రజలకు అసౌకర్యం ఏర్పడడం తోపాటు తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. అనధికార పార్కింగ్ వద్దని ట్రాఫిక్ పోలీసులు చెప్పినా వినే పరిస్థితి లేదు. సరైన స్థలం లేదనే కారణంతో ట్రక్ టెర్మినల్ ప్రతిపాదన వెనక్కి పోవడంతో ఈ పరిస్థితి మరింత జటిలమైంది.



గోపాలరెడ్డినగర్ వద్ద రోడ్డుపై నిలిపిన వాహనాలు

కప్పేయ్.. కట్టేయ్

- ఆక్రమిత స్థలాల్లో అక్రమ నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో గెడ్డలను కప్పేస్తున్నారు. ఆ పై నిర్మాణాలు చేస్తున్నారు. గ్రీన్ బెల్టు ఆక్రమించి నివాసాలు, వ్యాపార సముదాయాలుగా వినియోగిస్తున్నారు. ఇదిలా ఉంటే గ్రామం శివారు ప్రాంతాల్లో ఏకంగా గెడ్డలను మాయం చేస్తూ అక్రమ కట్టడాలు చేపడుతున్నారు. సర్వే నంబర్ 25/14లో ఒక వ్యక్తి గెడ్డలోని కొంత భాగాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. సిబ్బంది, అధికారులు స్పందించి ఆక్రమణలకు చెక్ పెట్టకపోతే భవిష్యత్తులో వాడుక నీరు పోయే మార్గం లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, సచివాలయాల సిబ్బంది తమ పరిధిలో పర్యటించి గెడ్డలతో పాటు రోడ్లు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలోని పరిస్థితులపై జీవీఎంసీ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడానికి సన్నద్ధమవుతున్నారు.



అక్కిరెడ్డిపాలెం శివారు ప్రాంతంలో గెడ్డను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణం

క్లుప్తంగా

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి



జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెదగంట్యాడ: ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలని కేఏస్ పాలెం మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామల పిలుపునిచ్చారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాఠశాల నుంచి పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేత పట్టుకుని ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు జెండా విశిష్టత, సాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు.

ఘనంగా పైడిమాంబ ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు, కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక నిర్వాసిత కాలనీ వాసుల గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి ఆలయ 14వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెదమడక, పరిసర నిర్వాసితకాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అగనంపూడి సత్యసాయి భజన మండలి, వెంకటేశ్వర,షిర్డీసాయి భజన మండళ్ల సారథ్యంలో భక్తిగీతాలాపన చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు విందుల నారాయణరావు, అమరపిన్ని కొండలరావు, విందుల సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, మజ్జి శ్రీను, విందుల వరహాలు, నరసింగరావు పాల్గొన్నారు.

కాలేయ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం



రోగితో లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ సచిన్ డాగా

అక్కిరెడ్డిపాలెం: చిన్నపాటి కోతతోనే కాలేయ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు. లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ సచిన్ డాగా మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోల్‌కతాకు చెందిన ఎండీ ముస్లాం (70) లివర్ సిరోసిస్‌తో బాధపడుతూ గత నెల 29న షీలానగర్ కిమ్స్ ఐకాన్‌లో చేరాడు. వృద్ధుడికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కాలేయ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. డాక్టర్ సచిన్ డాగా, హెపటాలజిస్టు డాక్టర్ చలపతిరావు, డాక్టర్ శరత్, డాక్టర్ రవి , డాక్టర్ రవిచంద్ సిద్ధాచారి, డాక్టర్ పరమేష్, డాక్టర్ రఘు, డాక్టర్ ప్రవీష్ ఇతర సిబ్బంది కలిసి వృద్ధుడికి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలో అత్యాధునిక పద్ధతి అవలంబించారు. దీంతో వృద్ధుడికి శారీరక బాధ నుంచి ఉపశమనం కలిగింది. ఆగస్టు 4వ తేదీన డిశ్చార్జ్ చేయగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

వాసవీ మాతకు కుంకుమ పూజలు



పెదగంట్యాడ: శ్రావణ మంగళవారం పురస్కరించుకుని జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో వాసవీ మాతకు భక్తులు కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, త్రిమూర్తులు ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా యాత్ర



ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు



ఉక్కు స్కేటింగ్ రింక్‌లో బాలబాలికలు

గాజువాక: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపులో భాగంగా గాజువాకలో కూటమి నాయకులు జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కొత్త గాజువాక జంక్షన్‌లోని మార్కెట్ వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ప్రారంభించారు. గాజువాక మెయిన్ రోడ్‌లో సినిమా హాల్ జంక్షన్ మీదుగా పాతగాజువాక జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగింది. రవీంద్ర మాట్లాడుతూ దేశ భక్తిని పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా అభియాన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, జనసేన నాయకుడు గడసాల అప్పారావు, కూటమి నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, గంధం వెంకటరావు, గూటూరు శంకరరావు పాల్గొన్నారు.

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని స్కేటింగ్ రింక్‌లో మంగళవారం రాత్రి 'హర్ ఘర్ తిరంగా' వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. సుమారు 300 మంది చిన్నారులు జాతీయ పతాకంతో స్కేటింగ్ చేశారు. ఉక్కు కార్పొరేట్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాండ్‌లో జాతీయ జెండా పట్టుకుని ఫొటోలు తీసుకున్నారు.

కాఫీ పొడితో కళాకృతులు



కాఫీ పొడితో విద్యార్థులు తయారు చేసిన జాతీయ నాయకుల చిత్రపటాలు



మూడు రంగులతో జాతీయ పతాకం, బ్యాడ్జీలు రూపొందించిన విద్యార్థులు

అగనంపూడి: కాఫీ పొడితో కళాకృతులు రూపొందించారు. విద్యార్థుల సృజనాత్మకతకు అద్దం పట్టేలా వివిధ జాతీయ నాయకుల చిత్రపటాలను తయారు చేసి అబ్బురపర్చారు. చిత్రకారుడు నాయిన సురేష్ ఆధ్వర్యంలో 85వ వార్డు అగనంపూడిలోని ఏబీఎస్ పాఠశాల విద్యార్థులు కళాకృతులను రూపుదిద్దారు. జాతిపిత గాంధీజీ, అంబేడ్కర్, సుభాష్ చంద్రబోస్ వంటి జాతీయ నాయకుల చిత్రపటాలను కాఫీ పొడితో రూపొందించగా, మరో 80 మంది విద్యార్థులు మూడు రంగుల కాగితాలతో రిబ్బన్లు, బ్యాడ్జీలు తయారు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మజ, డైరెక్టర్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వైద్య సౌకర్యం కల్పించాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



స్టీల్‌ప్లాంట్‌లో ర్యాలీ చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఉక్కునగరం: ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులకు యాజమాన్యం వైద్య సౌకర్యం కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై మంగళవారం ఉక్కు ఈడీ (వర్క్స్) బిల్డింగ్ నుంచి ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ నెలా పదోతేదీ లోగా జీతాలు చెల్లించక పోతే యాజమాన్యాన్ని అరెస్టు చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం మైండ్ గేమ్ ఆపి ఉత్పత్తి పెంచడంపై దృష్టిసారించాలని హితవు పలికారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్య రామ్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షులు జి. శ్రీనివాస రావు, కె.ఎం. శ్రీనివాసరావు, నమ్మి రమణ, వి.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

చిల్లర దొంగల హల్‌చల్



చిన నడుపూరు వుడా పార్కు గోడకు ఉన్న గేట్లను చోరీ చేస్తున్న దొంగలు

పెదగంట్యాడ: చిల్లర దొంగలు హల్‌చల్ చేస్తున్నారు.. అర్ధరాత్రి వేళ చోరీలకు పాల్పడుతున్నారు. చివరకు ఇనుప గేట్లను కూడా ఎత్తుకుపోతున్నారు. జీవీఎంసీ 73వ వార్డు పరిధిలో ఇటు చిన నడుపూరు అటు వుడా కాలనీ డబుల్ మధ్యలో పార్కు అభివృద్ధి చేసేందుకు గతంలో అధికారులు గోడలు నిర్మించారు. ఆ గోడలపై గ్రిల్స్‌తో పాటు పార్కులోకి రాకపోకలు సాగించేందుకు ఇనుప గేట్లు అమర్చారు. అయితే వీటిపై దొంగల కన్నుపడింది. రాత్రి వేళ ఎవరూ లేని సమయంలో ఆ గ్రిల్స్‌తో పాటు ఇనుప గేట్లను ఎత్తుకు పోతున్నారు. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పబ్లిక్‌గా దొంగలు చెలరేగిపోతుండడంతో భయపడిపోతున్నారు. దొంగల చర్యలను అరికట్టపోతే ఇళ్లలోకి దూరి దోపిడీ చేసే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రాత్రి వేళల్లో నిఘా పెంచాలని కోరుతున్నారు.

దేశ భక్తిని చాటేలా..



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్ బయట ఏర్పాటు చేసిన త్రివర్ణ పతాకం

అక్కిరెడ్డిపాలెం: పంద్రాగస్టును పురస్కరించుకొని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ బయట ఏర్పాటు చేసిన భారీ త్రివర్ణ పతాకం పలువురిని ఆకట్టుకుంటుంది. మంగళవారం పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం భారీ త్రివర్ణ పతాన్ని ఏర్పాటు చేశారు.

11 మందికి క్యాంపస్ కొలువులు



విద్యార్థులను అభినందిస్తున్న విజ్ఞాన్ చైర్మన్ రత్తయ్య

అగనంపూడి: ప్రాంగణ నియామకాల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులు మంచి వార్షిక వేతనంతో ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జె. సుధాకర్ తెలిపారు. ఈ మేరకు దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డీన్ బోడే ప్రసాద్, వివిధ విభాగాల రెక్టార్లు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ మెకానికల్ జీఎంకు సత్కారం



స్టీల్‌ప్లాంట్ మెకానికల్ జీఎం వీరేశంను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మెకానికల్ విభాగం (ఇన్‌చార్జి) జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్. వీరేశంను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ నాయకులు అభినందించారు. ఉక్కు ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ప్లాంట్ మెకానికల్ ఇన్‌చార్జిగా ఆయన నేతృత్వంలో స్టీల్‌ప్లాంట్ మరింత పురోభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాద్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో స్టీల్‌క్లబ్ సంయుక్త కార్యదర్శి జి. సురేష్, బి.ఎ. స్వామి, బి. డేవిడ్, లక్ష్మీ నాయక్, ప్రతిమ, కొండబాబు, అరవింద్, కృష్ణమూర్తి, కృష్ణయ్య, రవికుమార్, సాల్మన్ రాజు, లక్ష్మీప్రసాద్, పి.వి. ప్రసాద్, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భారీ విరాళం



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేస్తున్న దాత ఆదినారాయణ, వరలక్ష్మి దంపతులు

రూ.10 లక్షల అందజేత

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ దుర్గమాంబ, కుంచమాంబ ఆలయాలకు 69వ వార్డు నాతయ్యపాలెం వాస్తవ్యుడు, ప్రముఖ వ్యాపారవేత్త గోపిశెట్టి ఆదినారాయణ, వరలక్ష్మి దంపతులు, వారి కుమార్తె నిహారిక, సంధ్రాన గణేష్ భారీ విరాళం ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా రూ.10 లక్షల చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఆలయానికి భారీ విరాళం అందజేసిన ఆదినారాయణ దంపతులను ఎమ్మెల్యే అభినందిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పాత ఆలయంలో పూజలు నిర్వహించిన తర్వాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పౌరసన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, గాజువాకకు చెందిన టీడీపీ కార్పొరేటర్లు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ ప్రసాద్ తదితరులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో భౌద్ధ మిషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) జి.వి.ఎస్. ప్రసాద్ మిషన్ అభివృద్ధికి కృషి చేసిన అంబటి సర్వేశ్వరరావు, ఎన్. బాలభాస్కరరావు, పరంధామయ్య, సూర్యారావు, మాటూరి శ్రీనివాసరావు, పాల్తేటి పెంటారావును సన్మానించారు. పలు పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎన్ఎస్‌టీఎల్ టెక్నికల్ మేనేజర్ రామ్‌కుమార్ మిషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎల్. లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

నిర్వాసితులకు అన్యాయం చేస్తే ప్రతిఘటన తప్పదు



మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు నిర్వాసితులకు అన్యాయం చేయాలని చూస్తే వేలాది మంది నుంచి తిరుగుబాటు ఎదుర్కోవాల్సి ఉంటుందని విశాఖ ఉక్కు పరిరక్షణ,పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ,పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహించిన రిలే దీక్షా శిబిరంలో మంగళవారం ఆయన మాట్లాడారు. వేలాది ఎకరాల ఉక్కు భూములపై కన్నేసిన ఎన్డీఏ పెద్దలు బడా వ్యాపారులతో కుమ్మక్కై నిర్వాసితులు, ఉద్యోగులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అయోధ్యరామ్, ఎన్. రామారావు, నీలకంఠం, వై.టి.దాస్ పాల్గొన్నారు.